రైతులకు అవగాహన సదస్సులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి


నూతన్‌కల్‌లో రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

మేడ్చల్: వర్షాకాలం ప్రారంభమవుతండటంతో మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతులకు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని రాయిలాపూర్, నూతన్‌కల్,మైసిరెడ్డిపల్లి, రావల్‌కోల్, సైదనిగడ్డ తండాల్లో రైతులతో సమావేశం నిర్వహించి విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో దుకాణం నుంచి తప్పకుండా రశీదు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి మేరి లేఖ, ఏఓ అర్చన, ఏఈవోలు సుమిత, తేజస్విని, వివిధ గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్యాకింగ్ చూసి మోసపోవద్దు..

ఘట్‌కేసర్ : ప్యాకింగ్‌ను చూసి పోసపోవద్దని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి అన్నారు. ప్రతాపసింగారంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి బాసిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశానికి ఆయన హాజరై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం గుర్తించిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాల ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీపై ప్రధానంగా దృష్టిసారించాలని వివరించారు. ప్రతి కొనుగోలుపై రశీదు తీసుకోవాలని, పంట దిగుబడి చేతికొచ్చేంత వరకు జాగ్రత్తగా దాచిపెట్టాలన్నారు. విత్తనాలు, ఎరువులపై అనుమానం ఉంటే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త !

- మోసపోతున్న అన్నదాతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు


ఘట్‌కేసర్‌లో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

ఘట్‌కేసర్ : విత్తనం మంచిదైతే దిగుబడి ఆశించినంత లభిస్తుంది. అక్రమార్కులు తక్కువ ధర ఆశ చూపి అమాయక అన్నదాతలకు అంటగట్టి నిండా ముంచుతున్నారు. దీంతో పంట దిగుబడి రాక రైతులు మోసపోతున్నారు. ఇలాంటివి జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బాసిత్ తెలిపారు. శామీర్‌పేట్ మండలం అలియాబాద్‌లో గతంలో నకిలీ విత్తనాలు సీజ్ చేశారు.

అసలు పోలినట్లు...

వర్షాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తున్నారు. అదును చూసి అక్రమార్కులు రైతులను మోసం చేస్తున్నారు. విత్తనాల ఒరిజినల్ ప్యాకెట్లను పోలినట్లు ముద్రిస్తారు. కాని ప్యాకెట్లపై చిరునామా, తయారీ గడువు, తేదీ, లాట్ నెంబర్ ఉండవు. అసలు ధరకంటే తక్కువకు విక్రయిస్తారు. కొన్ని కంపెనీ ప్యాకెట్లు మార్కెట్‌లో ఉన్నవాటి మాదిరిగానే ఉంటాయి. పేరులో ఒక అక్షరం మాత్రమే తేడాగా ముద్రిస్తారు.

బిల్లు రశీదులు తీసుకోవాలి...

లైసెన్స్ కలిగి ఉన్న దుకాణాలు, డీలర్ల నుంచి కొనుగోలు చేయాలి. దళారుల దగ్గర కొనుగోలు చేయకూడదు. దుకాణదారుడు ఇచ్చిన బిల్లుపై తయారీ తేదీ, దుకాణదారుడి సంతకం తప్పనిసరిగా ఉండాలి. విత్తనాల సంచులకు ట్యాగ్, ముద్ర ఉందో లేదో చూసుకోవాలి. పంట చేతికి వచ్చే వరకు వాటిని బిల్లులు భద్రపరుచుకోవాలి. క్రిమిసంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు, కాలపరిమితికి సంబంధించిన బిల్లును తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అనుమతున్న డీలర్లు, వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లులు లేకుండా, లైసెన్స్ లేని వారి నుంచి కొనుగోలు చేసిన విత్తనాలు వద్ద పంటనష్టం జరిగితే పరిహారం లభించదు.

ప్యాకెట్‌పై వివరాలు చూసుకోవాలి..

ఎరువులు, విత్తనాల ప్యాకెట్లు, సంచులు ముందే విప్పి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే కొనుగోలు చేయకూడదు. గడువు తేదీని పరిశీలించాలి. ప్యాకెట్‌పై లోగో, కంపెనీ చిరునామా, మొలక శాతం ఉంటేనే కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులపై అనుమానం వస్తే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. నకిలీవని తేలితే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక చట్టంప్రకారం విక్రయదారుడిపై కేసు నమోదవుతుంది.

నకిలీలపై ఉక్కుపాదం...



ప్రజలందరికి అన్నం పెట్టే రైతులను మోసం చేసే అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. వారిపై ఉక్కుపాదం మోపి మరోసారి చేయకుండా కఠినంగా శిక్షించాలి.

– పన్నాల కొండల్‌రెడ్డి, రైతు అవుషాపూర్

అన్నదాతలకు అవగాహన కల్పించాలి..



విత్తనాలు మొలకొత్తే సమయం, దిగుబడి వచ్చిన తర్వాతే నకిలీవని తేలుతుంది. అమాయక అన్నదాతలు తెలియకుండా వాటిని కొనుగోలు చేసి పోసపోతారు. దీనిపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి.

– జంగయ్యముదిరాజ్, రైతు అవుషాపూర్

డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి...



నకిలీల బెడదను అరికట్టేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. ప్రధానంగా బిల్లు రశీదులు, ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీ ఇతర వివరాలను పరిశీలించాలి. విత్తన విక్రయ కేంద్రాలను తనిఖీ చేశాం. అధికారికంగా ప్రభుత్వం గుర్తించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

– బాసిత్, ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఎర్రన్న తెలిపారు. సాయిబాబా ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మార్కెట్‌రోడ్డు, సిల్వర్‌సీగల్లీ, ముత్తుస్వామికాలనీ, మోహన్‌రావుకాలనీ, వెంకటేశ్వరకాలనీ, భక్తబాయికాలనీ, వీరభద్రకాలనీ, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, ఆనంద్‌నగర్, డెంటల్ కాలేజీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీనగర్, సేవాలాల్‌తండా, ఆర్మీడెంటల్ కాలేజీ, సీఎస్ఐ చర్చి మల్కారం, భగత్‌సింగ్‌కాలనీ, మామిడితోట, కిష్టాపూర్, కృష్ణపురికాలనీ, గబ్బిలాల్‌పేట, శాంతినగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోచారం: నారపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటాద్రి టౌన్‌షిప్, చౌదరిగూడ, విజయపురికాలనీ, శివాజీనగర్, ఓయూ కాలనీ ప్రాంతాలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఇన్ఫోసిస్ హాస్టల్స్, సెరీన్‌హిల్స్, పోచారంతో పాటు శివాలయం చుట్టుపక్కల ప్రాంతాలు, అన్నానగర్, నాగారం 2బీహెచ్‌కే, ఏపీ కన్‌స్ట్రక్షన్స్, అగాపే ఆర్ఫానేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎంపీటీసీ వ్యవస్థను రద్దు చేయాలి !


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హారిక

శామీర్‌పేట్: ఎంపీటీసీలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న తీరే కొనసాగితే ఎంపీటీసీ వ్యవస్థను రద్దు చేయాలని మూడుచింతలపల్లి ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత నాలుగున్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిధులు, విధులు లేక ప్రజా సమస్యలను పరిష్కరించలేని ఈ పదవికి ఎవరూ.. పోటీ చేయొద్దని వివరించారు. అనంతరం ఎండాకాలంలో ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయం, నీటి సరఫరాతో పాటు పలు శాఖల పనితీరు సమస్యలపై సభలో చర్చించారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలోని ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు

కీసర: హోటల్స్, రెస్టారెంట్లలోని ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ జి.రాజేందర్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని హోటల్స్ యజమానులను ఆదేశించారు. శుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆహారం తయారీలో నాణ్యత పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై మొత్తం రూ.45 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మేనేజర్ కె.చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్‌రెడ్డి, లైసెన్స్ ఇన్‌స్పెక్టర్ ధర్మారెడ్డి, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ రాజేందర్‌కుమార్

ఊరెళ్లి వచ్చేసరికి..

ఇంట్లోని బంగారం, నగదు చోరీ

జవహర్‌నగర్: బంధువుల ఇంటికెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ సాయి సిద్ధార్థ కాలనీలో రవీందర్ జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. కాగా భార్య, కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 27న సిద్దిపేటలోని బంధువుల ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండగా.. బీరువాలోని వస్తువులన్నీ కింద పడేసి ఉన్నాయి. దీంతో బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో 10 తులాల బంగారం, వెండి, నగదు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఇంట్లో చిందరవందరగా వస్తువులు

ముంపు నివారణకు ముందస్తు జాగ్రత్తలు

అల్వాల్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముంపు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అల్వాల్ సర్కిల్ ఈఈ సి.శ్రీకాంతి తెలిపారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న నాలాల పూడికతీత పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఉరేసుకుని యువతి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన మాధవరావు కుటుంబంతో కలిసి మేడ్చల్‌లో నివసిస్తున్నారు. కుమార్తె శైలజ (24), స్థానికంగా ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంది. కాగా మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం కుటుంబసభ్యులు ఇంటికొచ్చేసరికి శైలజ విగత జీవిగా పడి ఉండటం, వీడియో కాల్ ఆన్‌చేసి ఉండటాన్ని పోలీసులు గమనించారు. ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

మరో ఘటనలో వివాహిత..

మేడ్చల్‌రూరల్ : ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాఘవేంద్రనగర్ కాలనీలో జరిగింది. ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లుకు చెందిన రత్తం నవీన్ భార్య స్వప్న (24), ముగ్గురు పిల్లలతో కలిసి రాఘవేంద్రనగర్ కాలనీలో ఉంటున్నారు. మంగళవారం ఉదయం భర్త నవీన్ పనికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న ఆమె సీలింగ్ రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి 8 గంటల సమయంలో భర్త ఇంటికొచ్చే సరికి ఉరేసుకుని కనిపించింది. లోపలి నుంచి గడియ ఉండటంతో తలుపులు పగులగొట్టి చూడగా.. అప్పటికే ఆమె మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.


స్వప్న (ఫైల్)

ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా : వచ్చే నెల 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సన్నద్ధమైనట్లు మల్కాజిగిరి ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయటంతో పాటు కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

- కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూసుకోవాలని, గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలని కోరారు.
- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ హాల్‌లో నిర్దేశిత రౌండ్ల వారీగా కౌంటింగ్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు.
- ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత సంబంధిత టేబుల్ కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.



- ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెల 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అనంతరం ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామని, కౌంటింగ్ సెంటర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రత్యేక మీడియా సెంటర్..

ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీఎంలను గోడౌన్‌కు తరలించేందుకు అవసరమైన వాహనాలు సన్నద్ధం ఉంటాయన్నారు. డీఆర్‌ఓ హరిప్రియ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు స్పందించరేమీ?



రామంతాపూర్: నెహ్రూనగర్ నుంచి సత్యదేవుని ఆలయం వైపు వెళ్లే రోడ్డు ప్రధాన రహదారిలో రాధాదేవి అపార్టుమెంట్ ప్రహరీకి అనుకొని చేతికందే ఎత్తులో ఎటువంటి కంచె లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను అనుకుని మూడు అపార్టుమెంట్లు ఉన్నాయి. ఫ్లాట్లలో నివాసముండే పిల్లలు నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఆడుకుంటారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, విద్యుత్ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు పెంచి రక్షణగా కంచె నిర్మించే విధంగా చూడాలని అపార్టుమెంట్ వాసులు కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రామంతాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ రాములు(ఫోన్ నెం.94408 13177)ను సంప్రదించాలి.

గురుకుల కళాశాల అడ్మిషన్లకు దరఖాస్తులు

ఘట్‌కేసర్ : మేడ్చల్ జిల్లాలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలురు, బాలికల కళాశాలలో మిగిలిన సీట్లలో ప్రవేశం కోసం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు గురుకుల ఆన్‌లైన్ ద్వారా రూ. 100లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి సుధాకర్ తెలిపారు. జిల్లాలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో శామీర్‌పేట్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు, ఎంఎల్‌టీ, టీహెచ్ఎం ఉప్పల్ కళాశాలలో బాలికలకు ఎంపీసీ, బైపీసీ, జగద్గిరిగుట్ట కళాశాలలో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులో సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జల మండలి.. ఇటు చూడరేమీ..?


సత్యదేవుని ఆలయం వద్ద పొంగుతున్న డ్రైనేజీ

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ఎస్పీ గ్యాస్ రోడ్డుతో పాటు శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి రోడ్డులో ఏడాదిలో సగానికి పైగా రోజులు డ్రైనేజీ పొంగి రోడ్లపై మురుగు పారుతూనే ఉంటోంది. సమస్య పరిష్కారానికి సిబ్బంది తరచూ భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తున్నారు. తిరిగి మరుసటి రోజే మురుగు పొంగి పారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కొత్తగా పెద్ద పైపులతో భూగర్భ డ్రైనేజీని నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు, జల మండలి అధికారులను కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి

– పి.సంతోష్‌కుమార్, జనరల్ మేనేజర్,
జలమండలి కార్యాలయం ఉప్పల్
ఫోన్ నం.99899 90699

టెక్సాస్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీ(టీఐఏ) విద్యార్థులు యునైటెడ్ స్టేట్స్‌లోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో బీటెక్ కోర్సు అభ్యసించడానికి పది లక్షల డాలర్లను స్కాలర్‌షిప్‌ల రూపంలో సాధించారు. ఈ విషయాన్ని టెక్సాస్ ప్రతినిధులు తెలిపారు. తమ విద్యార్థులు స్కాలర్‌షిప్స్ పొందిన కొన్ని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలలో కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ, అరిజోనా విశ్వవిద్యాలయం, మయామి విశ్వవిద్యాలయం, శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ వంటివి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా టెక్సాస్ రివ్యూ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకుడు రాజేష్ దాసరి స్కాలర్‌షిప్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

గంజాయి విక్రేతల రిమాండ్

కీసర: చట్టవ్యతిరేకంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను కీసర పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు రాంపల్లిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ దగ్గర ఇద్దరు వ్యక్తులు బైక్‌ను వదిలి కాలేజీ బ్యాగులతో పారిపోతుండగా.. మఫ్టీలో ఉన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ధూల్‌పేట్‌లోని గుర్తుతెలియని వ్యాపారి నుంచి 2 కిలోల ఎండు గంజాయిని రూ. 20 వేలకు కొని 25 గ్రాములు చొప్పున ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లో విక్రయించేందుకు రాంపల్లికి వచ్చినట్లు విచారణలో తేలింది. నిందితులు మార్క అరుణ్ (25), బాదోత్ గణేష్ (25)గా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 2 కిలోల గంజాయితో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

చేప పిల్లలు వచ్చేనా..?

- వర్షాకాలం సమీస్తున్నా... జాడలేని టెండర్లు
- శివారు చెరువుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు
- అదును దాటితే చెరువుల్లో చేప పిల్లలు వేయలేమంటున్న మత్స్య సంఘాలు
- గతేడాది జిల్లాలో 352 చెరువుల్లో 91 లక్షల చేప పిల్లల పంపిణీ

సాక్షి,మేడ్చల్ జిల్లా : మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటును ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రస్తుత ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వకపోవటంతో నీలి నీడలు అలుముకుంటున్నాయన్న అనుమానాలను మత్స్య సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి.

◆ ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల కోసం టెండర్లు పిలవాల్సి ఉంటోంది. అలా.. చేస్తేనే చెరువులు నిండే అదను వరకు చేప పిల్లల పంపిణీ సాధ్యమవుతుంది. ఆలస్యమైతే మాత్రం చేప పిల్లలను చెరువుల్లో పంపిణీ చేయడం అసాధ్యమని మత్స్య సహకార సంఘాలు చెబుతున్నాయి.

◆ ఊసేలేని టెండర్లు

గతంలో చేపపిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మే నెలలో మొదలై.. ముగిసేవి. కాంట్రాక్టర్లు కూడా సీజన్ మొదలయ్యే లోపే చేప పిల్లలను జిల్లాకు చేర్చి, నిండిన చెరువుల్లో 100 శాతం ఉచితంగా వదలడంతో వాటి ఎదుగుదల బాగుండేది.

◆ ఈ ఏడాది మే నెలాఖరు పూర్తవుతున్నా...

చేపపిల్లల పంపిణీపై రాష్ట్ర మత్స్యశాఖ స్పష్టత ఇవ్వటం లేదని మత్స్య సహకార సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి కూడా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ.. చేప పిల్లల టెండర్ల విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదల చేస్తేనే.. జిల్లాస్థాయిలో చేప పిల్లలకు సంబంధించిన ప్రక్రియ మొదలవుతుందని, దీనికోసమే ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ అదను దాటితే.. అంతే...

అదను దాటిన తర్వాత చేప పిల్లలను చెరువుల్లో వదిలితే.. వాటి ఎదుగుదల సరిగ్గా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు రెండోవారం లోపే చేప పిల్లల పెంపకాన్ని మొదలుపెట్టాల్సి ఉంటోంది. అప్పుడే చేపల ఉత్పత్తి బాగా ఉంటోంది. లేదంటే ఏ రకమైనా చేపైనా సరే.. బరువు అంతంత మాత్రమే ఉంటుందని మత్స్య సంఘాలు పేర్కొంటున్నాయి. ఒకవేళ ప్రభుత్వానికి చేపపిల్లలను పంపిణీ చేసే ఉద్దేశం ఉన్నా.. ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్లు నాసిరకం చేపపిల్లలను మత్స్యకారులకు అంటగట్టే అవకాశం ఉంటోందని పేర్కొంటున్నాయి. ఈ విషయాన్ని మత్స్యశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో చేప పిల్లలకు సంబంధించిన టెండర్లు నిర్వహించేలా చూడాలని సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



◆ గతేడాది 91 లక్షల ఉచిత పిల్లల పంపిణీ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 62 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 352 చెరువుల్లో ఉచితంగా 91 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ పంపిణీ చేసింది. ఈ చేప పిల్లలలో పెద్ద సైజు (80–100 ఎం.ఎం.) 13.50 లక్షలు కాగా, చిన్న సైజు చేప పిల్లలు (40–45 ఎంఎం) 77.50 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ ప్రకటించింది.

ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ మంజూరు చేయాలి

అల్వాల్: అల్వాల్ లయోలా కళాశాల వద్ద ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అల్వాల్ కార్పొరేటర్ చింతల విజయ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ లయోలా కళాశాల అల్వాల్ సాధన కమిటీ సభ్యులతో కలిసి సికింద్రాబాద్ డీఆర్ఎం భర్తేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. చర్లపల్లి నుంచి లింగంపల్లి వెళ్లే మార్గంలో కిష్టమ్మ ఎన్‌క్లేవ్ రోడ్డు మీనాక్షి ఎస్టేట్, అల్వాల్, సికింద్రాబాద్ వరకు రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని అల్వాల్ లయోలా కళాశాల సమీపంలో ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, ఢిల్లీ పరమేష్, ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ లయోలా కళాశాల అల్వాల్ సాధన కమిటీ సభ్యులు, రిటైర్డ్ రైల్వే ఆఫీసర్ నూర్ అహ్మద్, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, బెన్నీ, అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి తదితరులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి


మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న అభిమానులు

మేడ్చల్ : దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత ఎన్టీఆర్ జయంతిని ఆయన అభిమానులు, బీఆర్ఎస్, బీజేపీ నేతలు మేడ్చల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు నర్సింహ్మారెడ్డి, శేఖర్‌గౌడ్, ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.